


# మలిగిన దీపాలు

— కాటూరు రవీంద్ర-త్రివిక్రమ్

**దారి** చాలా ఇరుకుగా ఉంది.

పల్లేరుకాయలు విచ్చలవిడిగా ఉన్నాయి.

పచ్చగడ్డి ఒళ్ళు విరుచుకుంది.

కొండ శిఖరం మీది రామాలయం చుట్టూ ప్రదక్షిణాలు కొట్టి సూటిగా క్రిందికి దూసుకువచ్చి, ముసలివాడికి స్వాగతం చెప్పింది సాయంత్రపుగాలి.

ముసలివాడికి తోడుగా చంకను ఒక గొడుగు ఉంది. వీపున ఒక మూట ఉంది.

వయసును ఊరడిస్తూ, వణుకును పళ్ళ బిగువున అణుస్తూ, ముందుకు నడుస్తున్నాడు.

వెనకతట్టున ఊరు చిరు దీపాల కళ్ళను తెరుస్తోంది.

దిగంతాల అంచుల్లో కరిగిపోతున్న వెలుగు నివ్వెరపడి చూస్తోంది.

అయినా, వృద్ధుడు ఆగలేదు.

తన గమ్యం ముందుకే అన్నట్లు సాగిపోతున్నాడు.

ముసలివాడు గొణుక్కున్నాడు.

'ఏమిటీ దారి ఇలా అయిపోయింది? మనుషులు ఈ దారిలో నడవటమే మానివేశారా? అంతేకాబోలు. దేవుని మీద విశ్వాసం నశించిపోయిన మనుషులు మారుదారులు పట్టకేం చేస్తారు?'

చురుక్కున ముల్లు గుచ్చుకుంది.

చేతిలో బరువు మెల్లగా దించుకుని, జాగ్రత్తగా ముల్లు పీకివేశాడు. రక్తం చెమర్చి, పాదం ఎర్రబడింది.

బాధలోనే నవ్వు వచ్చింది.

చెప్పులు ఉన్నాయి.

కానీ, ఏం ప్రయోజనం?

పక్కనుండి గుచ్చుకుంది! ముళ్ళ పొదలు అలా పెరిగాయి, మరి.

మళ్ళీ ముందుకు సాగాడు.

పర్వతపాదం చేరుకున్నాడు.

రాతిమెట్లు అలాగే ఉన్నాయి. ఎటువచ్చి పిచ్చిమొక్కలు విచ్చలవిడిగా పెరిగాయి. పచ్చటి పాకుడు తివాచీలా ఉంది.

ఒక్కసారి నిలబడి పైదాకా పరిశీలించాడు.

శిఖరానికి తీసుకువెళ్ళే సోపానాలు.

మానవుని జ్ఞాన శిఖరానికి చేర్చే వేదాంత రహస్యాల్లా ఒకదాని నంటి ఒకటి ఉన్నాయి.

ఒక్కసారి గతించిన బాల్యం కళ్ళముందు కదిలింది.

• • • •

అప్పు డీ మెట్లు ఎంత శుభ్రంగా ఉండేవి!

అటు, ఇటు అవిటివాళ్ళు, అనాథలు ధర్మం యాచిస్తూ ఉండేవాళ్ళు. ఎంతదూరం నుండో యాత్రీకులు బళ్ళమీద, కాలినడకను వచ్చి దేవుణ్ణి కొలిచి పోతూండేవాళ్ళు. కడిగినంత శుభ్రంగా ఉండేవి మెట్లు.

తాను రెండేసి మెట్లు చొప్పున గెంతుతూ పైకి వెళ్ళేవాడు.

గాలి గోపురం మీద చిరుగంటల సవ్వడి, రివ్వున వీచే చల్లగాలి ఎంతో హాయిగొలిపేవి.

శ్రీరామచంద్రమూర్తి నిలువెల్లా బంగారు కవచంతో, నగలతో, కిరీటంతో అభయహస్తం చూపుతూ ఉండేవాడు. ఏ నాడు వెలిసిందో కానీ నిలువెత్తు విగ్రహ మది. జానకీదేవి, లక్ష్మణస్వామి, ఆంజనేయుల విగ్రహాలు కాస్త చిన్నవిగా ఉండేవి.

ప్రతి ఏడూ సీతారామ కళ్యాణం మహా వైభవంగా జరిగేది. ఎక్కడా నిలబడేందుకు సైతం తావు వుండేది కాదు. అయినా, తాను దేవునికి సమీపంలోనే వుండేవాడు.

జరిగే తతంగాల నన్నింటినీ శ్రద్ధగా, ఆసక్తిగా కన్ను లింతలు చేసుకుని మరీ చూసేవాడు. ప్రసాదాలను మళ్ళీ, మళ్ళీ అడిగి పెట్టించుకునే వాడు.

ఆ కర్పూర హారతి వాసనలు, తులసి తీర్థం, శఠగోపురం, శ్రీరామనామ అష్టోత్తర పూజా దృశ్యం — ఓహ్! ఒక బంగారు కల! ప్రస్తుతం లోకి వచ్చాడు.

మళ్ళీ శక్తి పుంజుకున్నాడు.

మెట్లు ఎక్కసాగాడు.

చేతిలోని బరువులు ఆయాస పెడుతున్నాయి.

అలాగే ఓపిక చేసుకున్నాడు. ఒక్కో మెట్టూ అధిగమిస్తున్నాడు.

"కొండమీద ఎందుకెక్కావు, దేవుడా?"

"అంటే కాని పనులు చేసేవాళ్ళను గమనించటానికి, భక్తుల ఓర్మిని పరీక్షించటానికీ" అన్నట్టు! చిన్నతనంలో అమ్మమ్మ అంటూండేది ముక్కుతూ, మూలుగుతూ కొండ ఎక్కే.

ఆ మూట నిజమే నన్న నమ్మకం ఇప్పటికీ చెరిగిపోలేదు తనలో.

కాళ్ళు వణుకుతున్నాయి.

ఒక్క నిమిషం నిలబడి గాలి పీల్చుకున్నాడు.

క్రిందికి చూశాడు.

సగం మెట్లు ఎక్కినట్లే.

సంబరం కలిగింది.

కొత్త శక్తితో మిగతా మెట్లు దాటటానికి ఉత్సాహపడ్డాడు. అజ్ఞానంలా అలముకొంటున్నది చీకటి.

ఎక్కడో దూర తీరాల నుండి పయనిస్తున్న నల్ల మేఘం అంతకంతకు పెద్దది అవుతున్నది.

మెట్లన్నీ ఎక్కేసరికే ఆలయం చీకట్లో మునిగిపోతూ కనిపించింది. దానికి మేఘం రెక్కలు విప్పిన గండభేరుండంలా నెత్తి మీదికి వచ్చింది.

చీకటి మరింత గాఢమయింది.

వడి వడిగా ఆలయ ప్రాంగణం వైపు నడిచాడు. రివ్వున చల్లగాలి, టపటపా చినుకులు తరుముకు వచ్చాయి.

గొడుగు విప్పాడు.

మూట తడవకుండా గుండెల కదుముకుని, సమీపంలో ఉన్న మండపంలోకి దూరాడు.

వాన జోరయింది.

ఉరుములు, మెరుపులు.

మండపం చాలా చిన్నది కావటంవల్ల ఉధృతంగా వీస్తున్న గాలికి పడుతున్న జల్లు అతన్ని పూర్తిగా ఆక్రమించడానికి విశ్వప్రయత్నం చేస్తోంది. వెన్ను మీద చరుస్తోంది. భుజాలు కుదిపేస్తోంది.

కానీ, పెద్దగా గుండె దాచుకుని ఉన్న మూట మాత్రం పదిలంగా ఉంది. తన సర్వస్వం అదేనన్నట్లు, దాని రక్షణే తన పరమావధి అన్నట్లు కౌగిలించుకున్నాడు. సగం క్రింద గొడుగు కర్రను అదిమిపట్టి ఉంచాడు.

"నాకూ కాస్త చోటు ఉందా?" ఉలిక్కిపడ్డాడు వృద్ధుడు.

ఆలయంలో దీపం సైతం వెలుగకపోతే, నర సంచారమే లేదనుకున్నాడు. పూర్వం ఉన్న పూజారి వెలిగించిన దీపం ఆరేది కాదు. అఖండంగా వెలుగుతూనే ఉండేది.

ఇప్పుడెవరీ వ్యక్తి?!

దేవుడితో మొర పెట్టుకోవాలని, ఇన్నేళ్ళ ప్రవాసం తరవాత ఆ కోదండరాముణ్ణి కళ్ళారా చూసి కైమోడ్పాలని వచ్చిన తన ఏకాంతానికి విఘ్నం కలిగించిన ఆ గొంతుకు దెవరు?

ఎవరైతేనేం?

వచ్చాడు.

జడివానలో కాస్త చోటిమ్మంటున్నాడు.

'రా, బాబూ రా ఇలా. ఈ గొడుగులోనే సర్దుకో.'' ఆహ్వానించాడు జాగా కల్పిస్తూ.

ఆ వ్యక్తి ఆనవాలేమీ తెలియటం లేదు

ఒంటిమీద పెద్దగా బట్టలు ఉన్నట్లూ లేదు.

ఏ పశువుల కాపరో! గోచిపాత చాలుగా వాళ్ళకు! అంటి అంటనట్లు సర్దుకు కూర్చున్నాడు.



వాన మోతలు భయావహంగా ఉంది. ఆకాశం నల్ల సముద్రంలా ఉంది. తటిల్లతలు తెగిపోతున్నాయి. మేఘ దుందుభులు మ్రోగుతున్నాయి.

"నాకు తెలియక అడుగుతాను—ఇన్నేళ్ళ తరవాత ఈ పాడుబడిన ప్రాంతాని కెందుకొచ్చావు, చంద్రయ్యా?"

వృద్ధుడు ఉలిక్కి పడ్డాడు.

"నేనెవరో నీకు తెలుసా?" ఆశ్చర్యంతో ప్రశ్నించాడు.

"తెలియకేం? నీది సీతాపురమనీ, పయసులో నిన్ను కృష్ణచంద్రుడనే వాళ్ళనీ కూడా తెలుసు. నీ పిచ్చిగానీ, ఆ మూటలో ఉన్న నీ అమూల్య ధనానికి ఇంకా కాలం చెల్లలేదనుకుంటున్నావా?"

'ఆ వ్యక్తి బైరాగి కాదు కదా!' అన్న అనుమానం పెల్లుబికింది చంద్రయ్యలో. తట్టుకున్నాడు.

"ఈ మూటలో ఏముందన్నావ్?"

"ఏముంటే నేం? అవి ఇప్పుడు పనికి రావు! ఆ కోనేట్లో పారెయ్యి."

చంద్రయ్యకు ఆవేశం వచ్చింది.

"ఏమన్నావ్? ఇది నా జీవిత మంతా చేసిన తపస్సు. దీన్ని నీటిపాలు చెయ్యనా?" కర్కశంగా పలికింది గొంతు.

నవ్వాడతను.

"అంతే, చంద్రయ్యా, అంతే! ఎవరూ ఆ పని చెయ్యలేరు. ఎందుకు ఆ కథలూ, కావ్యాలూ, పద్యాలూ మూట కట్టావ్? ఎవరికి చూపించి మెప్పిద్దామని?"

చంద్రయ్యకు వెన్నులో నుండి వణుకు పుట్టుకు వచ్చింది.

ఈ వ్యక్తి నిశ్చయంగా అసామాన్యుడు.

అతని పెదవులు కదల లేదు. ఆశ్చర్యంతో బిగుసుకు పోయాయి.

"ఆ కథల్లో ఎక్కువ భాగం ఈ మండపంలో కూర్చుని క్రుంగుతున్న దిగంతాల అంచుల్ని చూస్తూ ప్రకృతి రహస్యాలు తిలకిస్తూ వ్రాశావు కదూ?"

ఓడిపోయాడు చంద్రయ్య.

అతని చేతుల పట్టు సడలింది.

మూట జారింది మెల్లగా. జల్లులో తడిసిపోసాగింది.

చంద్రయ్యకు ఇప్పుడు దాని మీద శ్రద్ధ లేదు.

దాని రక్షణ మీద ఆసక్తి లేదు.

మాటలు తెలియని బొమ్మలా వింటున్నాడు.

"నువ్వెక్కడో ప్రవాసానికి వెళ్ళి వచ్చావు, చంద్రయ్యా! ఇక్కడి ప్రపంచం మారిపోయింది. ప్రజలు మారిపోయారు. నీ బూజు పట్టిన చాందస భావాలు తెలిస్తే తన్ని తగిలేస్తారు."

చంద్రయ్య మెల్లగా తేరుకుంటున్నాడు.

కొండ క్రింద ప్రపంచంలో చాలా మార్పులు వచ్చినా యున్న మాట!

"చూడు, బాబూ! ఈ దేవాలయాన్నిలా పాడు పెట్టిం దెవరు? ఇక్కడ నిత్య కళ్యాణం పచ్చతోరణం ఉండేది కదా?"

అతని కంఠంలో మార్పు వచ్చింది.

"కారణాలు ఇందాకటివే! దేవాలయ ధర్మకర్తలు దొరికినంతా స్వాహా చేసి ఆలయ నిర్వహణ అశ్రద్ధ చేశారు. వచ్చే వాళ్ళు సన్నగిల్లారు. కళ్యాణ వేడుకలు అంత మొందాయి. అమ్మవారి నగలు, అయ్యవారి అలంకారాలు అదృశ్యమైనాయి. లక్ష్మణస్వామి జానకమ్మ, ఆంజనేయులు విగ్రహాలు అమెరికా చేరుకున్నాయి. రామయ్య మిగిలాడు ఒంటరిగా."

వింతగా, విడ్డూరంగా అనిపించింది.

దేవాలయంలో ఆభరణాల దొంగతనం!

అటుపైన దేవతలనే ఎత్తుకు పోవటం!

ఇంకా నయం, గుడి మిగిల్చారు.

"ఎంత అనాగరికం ప్రబలింది!" మనసు మూలిగినట్లు అన్నాడు చంద్రయ్య.

"ఈ కొండకు వచ్చే దారులన్నీ మూసుకు పోయినాయి. ఇన్నాళ్ళకు, ఇంత వెర్రి వ్యామోహంతో వచ్చిన నిన్ను చూశాను. కలం కదిలించే శక్తి ఇంకా ఉంటే ఒక ఒక చివరి కథ వ్రాయి."

"ఏమిటది?"

"మానవుడి హృదయ శిథిలాలకు తార్కాణంగా నిలిచిన ఆలయం గురించి, మన కలయిక గురించి. వస్తాను, వాన తగ్గింది."

చీకట్లో కరిగి పోతున్న ఆ వ్యక్తిని ఉద్దేశిస్తూ, "ఇంతకూ నీ వెవరో చెప్పందే నే నే మని వ్రాసేట్లు?" అంటూ దాదాపు అరిచాడు చంద్రయ్య.

ఎక్కడో దూరాన పిడుగు పడింది.

తిండి తినని మీదట ఒక్కసారి నీరసం ఆవరించింది. కళ్ళు బైర్లు కమ్మి, మెల్లగా మూతలు పడసాగాయి.

ఎంత మరుక్కుమనిపిస్తే కానీ కళ్ళు విడలేదు.

అదిరి పడి లేచి కూర్చున్నాడు.

మూట ఒక పక్క, గొడుగు మరొక పక్క పడి ఉన్నాయి. మూటలోని పన్నీ తడిసి ముద్ద అయి పోయాయి. నిట్టూర్చి, కోనేట్లోకి గిరవాటు వేశాడు.

గుడి నానా భీభత్సంగా ఉంది.

పిచ్చి మొక్కలూ, లతలూ, చివరికి వల్మీకాలు కూడా చోటు చేసుకున్నాయి. నలు దెసలా పరికిస్తూ ముందుకు వెళ్ళాడు.

పండలకొద్దీ దీపాలు వెలిగించడానికి పనికివచ్చే రాతి స్తంభాల మీద చెక్కిన ప్రమిదలు! ఎన్నాళ్ళయిందో ఆ దివ్వెలు వెలిగి! అవి మలిగిన దీపాలు. మరి వెలగని దీపాలు. నిట్టూర్చాడు.

ముందుకు అడుగు వేశాడు.

గుండె ఆగినంత పని అయింది.

గర్భగుడికి కప్పేలేదు! అంటే తను తలదాచుకున్న చిన్న మందిరం ఒక్కటే వానకు రక్షణ ఇవ్వగలదన్న మాట. నోట మాటరాక దిగ్భ్రమతో నల్లరాయి రూపంలో, ఎన్నో దశాబ్దాల క్రితం వెలసిన వైభవం సాగించుకున్న కోదండ రాముడులో రాత్రి తనుచూసిన వ్యక్తి పోలికలు కనిపిస్తుంటే కొయ్యబారిపోయాడు చంద్రయ్య. ★